సాక్షి ములుగు

ఆదివారం | 15 | అక్టోబర్ | 2023



ఓటర్లకు కానుకలు

పర్వతగిరి మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు నిల్వ చేసిన వాటర్ బాటిల్స్, లంచ్ బాక్స్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 10లో▸



జేఎన్ఎస్‌లో క్రీడాపండుగ..

హనుమకొండలోని జేఎన్ఎస్‌లో నేటి నుంచి సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. సుమారు 1000 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. - 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.5⁰/24.0⁰

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. సాయంత్రం చల్ల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎన్నికల నిబంధనలు పాటించాలి



ములుగు రూరల్: అసెంబ్లీ ఎన్నికల నింబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని ములుగు సీఐ మేకల రంజిత్ అన్నారు. మండల పరిధిలోని మహ్మద్‌గౌస్‌పల్లిలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లే క్రమంలో ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. వాహనాల్లో మద్యం, నగదు తరలిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ములుగు మండల పరిధిలోని మల్లంపల్లి నుంచి నర్సంపేటకు వెళ్లేదారిలో, మహ్మద్ గౌస్‌పల్లిలో జాతీయ రహదారిపై చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని వివరించారు. ఈ తనిఖీల్లో ఎస్సై వెంకటేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ



మంగపేట : మండల పరిధిలోని తిమ్మంపేట క్రాస్ రోడ్డు వద్ద కారును తప్పించబోయి పంట పొలాల్లోకి ఓ లారీ దూసుకెళ్లింది. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి వస్తున్న లారీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండల పరిధిలోని వీరాపురం ఇసుక క్వారీలో ఇసుక లోడింగ్‌కు వెళ్తుంది. మార్గమధ్యలోని తిమ్మంపేట క్రాస్ రోడ్డు సమీపంలో మణుగూరు వైపు నుంచి వస్తున్న ఓ కారు డ్రైవర్ సెల్‌ఫోన్ చూస్తూ ఎదురుగా వస్తున్న లారీని గమనించక లారీకి ఎదురుగా వెళ్లాడు. దీన్ని గమనించిన లారీ డ్రైవర్ వడ్డె రమేష్ కారును తప్పించే క్రమంలో అదుపు తప్పిన లారీ ముందు ఉన్న కల్వర్టును ఢీ కొట్టి వెళ్లి వరి పొలాల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక

భూపాలపల్లి అర్బన్: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు జిల్లాకేంద్రంలోని మైనారిటీ గురుకుల కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 4నుంచి 7వరకు వరంగల్‌లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. క్రికెట్ విభాగంలో అబ్దుల్‌ఫైసల్, మణికంత, రాజేష్, ఖోఖోలో అబ్దుల్ రెహమాన్, చెస్‌లో యశ్వంత్ రెడ్డి, రెజ్లింగ్‌లో సలీంపాషా, సాఫ్ట్‌బాల్‌లో అఫ్రోజ్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



భూపాలపల్లి అర్బన్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో భూపాలపల్లి ఏరియాలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. సివిల్, తోటమాలి, సివిక్ స్టోర్, గెస్ట్‌హౌస్, అండర్ గ్రౌండ్, ఇతర విభాగాల కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న మాట్లాడుతూ.. సింగరేణిలో రూ.2,222 కోట్ల లాభాలు వస్తే రూ.711 కోట్ల లాభాల వాటా ప్రకటించారన్నారు. పర్మనెంట్ కార్మికులతో సమానంగా పని స్థలాల్లో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాలవాటా ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రగిరి శంకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ దసరా బహుమతులు

భూపాలపల్లి: సద్దుల బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందించనున్నట్లు భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మినారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా భూపాలపల్లి డిపో నుంచి హైదరాబాద్, హనుమకొండ, గోదావరిఖని రూట్లలో అదనంగా 30 సర్వీస్‌లను నడపనున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు, 28 నుంచి 30వ తేదీ వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారు టికెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్‌లో లక్కీడిప్ బాక్స్‌లలో వేయాలని సూచించారు. 31వ తేదీన రీజియన్ హెడ్ క్వార్టర్‌లో డ్రాతీసి ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు.



మల్లంపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఎంగిలిపూల సంబురం

జిల్లాలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ములుగు పట్టణంతో పాటు ఏటూరునాగారం, వెంకటాపురం(ఎం), మంగపేటతో పాటు గ్రామాల్లోని మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చారు. సాయంత్రం ఆలయాల వద్దకు చేరుకుని ఆడి పాడారు. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

- సాక్షి, నెట్‌వర్క్

- మరిన్ని ఫొటోలు 10,11లో▸



ఏటూరునాగారంలో బతుకమ్మ ఆడేందుకు వెళ్తున్న మహిళలు



ఏటూరునాగారంలోని బస్టాండ్ సమీపంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సీఎం కేసీఆర్ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు



వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్య, అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

- రేపు జనగామలోని మెడికల్ కళాశాల మైదానంలో బహిరంగ సభ
- పనులను పర్యవేక్షించిన మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యేలు, అభ్యర్థి

జనగామ: సాధారణ ఎన్నికల ప్రచారంలో భాగంగా జనగామ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సభ కోసం సిద్దిపేటరోడ్డు మెడికల్ కళాశాల మైదానంలో చేస్తున్న ఏర్పాట్లను శనివారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సభా వేదిక, హెలిపాడ్ తదితర చోట్ల సీఎం ప్రత్యేక నిఘా విభాగం, డాగ్, బాంబు స్క్వాడ్ బృందాలు తనిఖీ చేపట్టాయి. వికాస్‌నగర్ నుంచి సభావేదిక వరకు



సభా ప్రాంగణంలో సిద్ధమవుతున్న వేదిక

కేసీఆర్ వచ్చే రూట్‌ను ఆధీనంలోకి తీసుకున్నారు.

సీపీ పరిశీలన

వికాస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్, మెడికల్ కళాశాల మైదానంలోని సభా వేదిక, ఏర్పాట్లను వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా శనివారం పరిశీలించారు. బారికేడ్లు, సభా వేదిక, సభకు వచ్చి, వెళ్లే మార్గాలు, వీఐపీ దారుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచలు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన వారిలో క్రైం డీసీపీ దాసరి మురళీధర్, అదనపు డీసీపీ సంజీవ్, ఏసీపీలు జితేందర్ రెడ్డి, రమేష్ కుమార్, ఇతర పోలీస్ అధికారులు ఉన్నారు.

కట్టుదిట్టమైన రక్షణ చర్యలు

- అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు 13 సీఆర్‌పీఎఫ్ కంపెనీలతో పర్యవేక్షణ
- ఇప్పటికే 1200 లీటర్ల మద్యం పట్టివేత
- ఎస్పీ గౌష్ ఆలం



మాట్లాడుతున్న ఎస్పీ గౌష్‌ఆలం

ములుగు: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అన్ని గ్రామాలు, సరిహద్దుల్లో కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకుంటామని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో పోలీస్‌శాఖ తరఫున చేపడుతున్న తక్షణ చర్యలపై శనివారం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రెండు అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు పేరూరు, వెంకటాపురం(కె) వద్ద, మరో మూడు అంతర్ జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లుగా వివరించారు. ఇప్పటి వరకు 1200 లీటర్ల లిక్కర్ పట్టుకొని సంబంధిత శాఖకు అప్పగించామని తెలిపారు. శాంతి భద్రతలకు ఎలాంటి అవాంతరాలు ఎదురైనా, మత, కుల రాజకీయం, ప్రార్థన సమయంలో ఎక్కడైన గొడవలు జరిగితే ప్రజలు మీడియా సెంటరింగ్ మానటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ), 1950 టోల్ ఫ్రీ నంబర్, నేరుగా గానీ ఎస్డీపీఓలకు సమాచారం అందించాలన్నారు. కోడ్ ఆఫ్ కండక్ట్‌లో సీ విజిల్ ద్వారా 100 మీటర్ల మేరకు రికార్డు అవుతుందని తెలిపారు. వీటి ఆధారంగా ఎప్పుడైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు 13 సీఆర్‌పీఎఫ్ కంపెనీల బలగాలను వినియోగించనున్నట్లు తెలిపారు. ఇందులో సుమారు ఆరు కంపెనీలు అందుబాటులో ఉన్నాయన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు, బంగారం, ఆభరణాలు వెంట తీసుకెళ్లేటప్పుడు సంబంధిత పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. 7రోజుల్లో సక్రమమైన పత్రాలు అందిస్తే తిరిగి అందిస్తామన్నారు. లేని పక్షంలో గ్రీవెన్స్‌కు అప్పగిస్తామని తెలిపారు.

పర్యవేక్షణ నిల్!

- అంగన్‌వాడీ కేంద్రాలపై కొరవడిన అధికారుల నిఘా
- సెంటర్లకు చేరుతున్న కాలం చెల్లిన సరుకులు
- కుళ్లిన కోడిగుడ్ల పంపిణీపై కమిషనర్‌కు ఫిర్యాదు
- అధికారుల మధ్య లోపించిన సమన్వయం

ఏటూరునాగారం: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలపై స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. సూపర్‌వైజర్లు, సీడీపీఓల మధ్య సమన్వయం లోపించి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల ఏటూరునాగారం మండల కేంద్రంలోని మానసపల్లిలో కుళ్లిపోయిన కోడిగుడ్లు తిని ఒకరు అస్వస్థతకు గురికావడంతో రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు, కోడిగుడ్లు సరఫరా చేసే వ్యాపారులు అధికారులకు కమీషన్లు ఇస్తుండడంతో అధికారులు ఎలాంటి సరుకులు ఇచ్చినా ఓకే చెబుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యత లేని సరుకులు, కోడిగుడ్లు వస్తున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. అంతేకాకుండా మండల కేంద్రంలో మరో అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు సరఫరా చేయకుండా మిగిలి ఉన్న సరుకులను ఇన్‌చార్జ్ డీబ్ల్యూఓ వాహనంలో తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు



కుళ్లినకోడిగుడ్లను పగులగొట్టిన లబ్ధిదారులు

తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి.

ఏఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులు

ఏటూరునాగారంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పనిచేసే అకౌంటెంట్ మిర్జా, సీడీపీఓ తనను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని సూపర్‌వైజర్ ఏఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఇదే తరుణంలో సూపర్ వైజర్ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, కిందిస్థాయి టీచర్లను ఒత్తిడికి గురిచేస్తుందని సీడీపీఓ సైతం ఏఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఇలా ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటూ స్త్రీ శిశు సంక్షేమశాఖను భ్రష్టుపట్టిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

పక్కదారి పడుతున్న సరుకులు

జిల్లాలోని మారుమూల సెంటర్ల నుంచి సరుకులను కిరాణం షాపులకు తరలిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. కోడిగుడ్లు, పప్పులు, ఇతర వస్తువులను పక్కదారి పడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇవే కాకుండా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు పారితోషికం వస్తువులను మంజూరు



అంగన్‌వాడీ కేంద్రం

జిల్లాలోని అంగన్‌వాడీ ప్రాజెక్టులు, సెంటర్ల వివరాలు	
ప్రాజెక్టులు	04
ప్రధాన సెంటర్లు	549
మినీ సెంటర్లు	91
చిన్నారులు	8,273

చేసింది. జిల్లాలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లోని కొంత మంది టీచర్లుకు మాత్రమే పారితోషికం వస్తువులు అందాయి. మిగితా వారికి కుక్కర్, ఇతర వస్తువులు పూర్తి స్థాయిలో పంపిణీ చేయకపోవడంతో అందినవారు గప్‌చుప్‌గా ఉండగా అందని వారు అధికారులను ప్రశ్నిస్తున్నప్పటికీ పొంతనలేని సమాధానాలు చెబుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కొంత మంది అధికారులతో ఆ వస్తువుల పంపిణీ విషయంలో కక్కుర్తిపడి మిగిల్చుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

అందరూ.. అందరే..

ఉన్నతాధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించి ఉంటే కింది స్థాయి సిబ్బంది సైతం సక్రమంగా పనిచేసేవారు. కానీ ఉన్నతాధికారులు, ప్రాజెక్టు అధికారులు సైతం విధుల పట్ల నిర్లక్ష్యం చేయడంతోనే కింది స్థాయి సిబ్బంది విధుల్లో బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్న పరిస్థితి తయారయింది. అంగన్‌వాడీ సెంటర్లు, అధికారుల తీరు మారాలంటే కమిషనర్ స్థాయి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు చర్చించుకుంటున్నారు.

బతుకమ్మకు వస్తనంటివి బిడ్డా..



విలపిస్తున్న ప్రవళిక తల్లి విజయ



ప్రవళిక మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ సురేష్‌యాదవ్

- తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయావా
- మిన్నంటిన ప్రవళిక తల్లిదండ్రుల రోదనలు
- బిక్కాజిపల్లి గ్రామంలో విషాదఛాయలు

దుగ్గొండి : అమ్మా నాన్న జాగ్రత్త.. బతుకమ్మ ఆడుకునే సమయానికి ఇంటికి వస్తా.. అని ఫోన్‌లో మాట్లాడిన కొద్ది సేపటికే ఆ చదువుల తల్లి అనంత లోకాలకు వెళ్లిపోయింది. గ్రూప్–2 పరీక్షలు వాయిదా పడడంతో మనస్తాపానికి గురై మండలంలోని బిక్కాజిపల్లి గ్రామానికి చెందిన మర్రి విజయ–లింగయ్య దంపతుల కుమార్తె ప్రవళిక (22) ఆత్మహత్య ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అల్లారుముద్దుగా పెంచుకున్న తమ బిడ్డ ఇక తిరిగిరాదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. వారిని ఓదార్చడం ఎవరితరం కావడం లేదు. విజయ–లింగయ్య దంపతులు కుమార్తె ప్రవళిక, కుమారుడు ప్రణయ్‌కుమార్‌ను ఉన్నంతలో బాగా చదివిస్తున్నారు. ప్రవళిక హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసింది. సంవత్సర కాలం నుంచి హైదరాబాద్‌లో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతోంది. శుక్రవారం సాయంత్రం ఆరున్నర గంటలకు తల్లిదండ్రులతోపాటు సోదరుడు ప్రణయ్‌కుమార్, శాయంపేట మండలం నేరేడుపల్లిలోని తన అమ్మమ్మతో ఫోన్‌లో మాట్లాడింది. అన్నం తిన్నారా అని అడిగింది. బతుకమ్మ ఆడుకోవడానికి శనివారం సాయంత్రం వరకు తాను ఇంటికి వస్తానని చెప్పి ఫోన్ పెట్టేసింది. పరీక్షలు వాయిదా పడి మనస్తాపానికి గురై ప్రవళిక ఆత్మహత్య చేసుకుందనే పిడుగులాంటి వార్త వారికి చేరింది. ఇప్పుడే తమ కూతురు ఫోన్‌లో మా ట్లాడి విగత జీవిగా మారిందని తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

పోలీసులే సమాధానం చెప్పాలి..

మా అక్క చదువులో నాకన్నా చురుకైనది. ఎలాగైనా ఉద్యోగం సంపాదిస్తా అని చెబుతూ ఉండేది. గ్రూప్–2 ఉద్యోగమే లక్ష్యంగా ప్రిపరేషన్ అవుతోంది. పరీక్షలు వాయిదా పడడంతో కొంత ఆందోళన చెందినప్పటికీ ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదు. మేము హైదరాబాద్ వెళ్లే వరకే చనిపోయి ఉంది. రాత్రికి రాత్రే పోస్టుమార్టం చేశారు. అసలు ఎలా చనిపోయిందో, సూసైడ్ లెటర్ ఒకటని, రెండని పోలీసులు చెబుతున్నారు. వారే నిజాలతోపాటు సమాధానాం చెప్పాలి.

- మర్రి ప్రణయ్‌కుమార్, ప్రవళిక సోదరుడు

ఆత్మహత్య చేసుకోవద్దు.. పోరాడి సాధించుకుందాం

- ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ సురేష్‌యాదవ్

దుగ్గొండి: ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీచేయడం లేదని, పరీక్షలు వాయిదా పడుతున్నాయని మనస్తాపం చెంది ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దని, పోరాడి ఉద్యోగాలు సాధించుకుందామని ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ సురేష్‌యాదవ్ అన్నారు. మండలంలోని బిక్కాజిపల్లి గ్రామంలో మర్రి ప్రవళిక మృతదేహానికి శనివారం ఆయన నివాళులర్పించి మాట్లాడారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ, బతుకమ్మ పండుగకు ఇళ్లకు వెళ్లలేక లోలోన మదనపడుతున్నారన్నారు. పదేళ్ల కాలంలో ప్రభుత్వాలు ఉద్యోగాలు భర్తీచేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రవళిక అంత్యక్రియల్లో జనాలకంటే పోలీసులే ఎక్కువగా ఉన్నారని, రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తోందని సురేష్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట కేయూ విద్యార్థి నాయకులు తిరుపతి, గణేష్, సురేష్, మహేష్ ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

- ఎస్పీ సంగ్రాం సింగ్ జీ పాటిల్
- ములుగు ఎస్పీ, ఏఎస్పీలతో సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ సంగ్రాం సింగ్ జీ పాటిల్, పాల్గొన్న ఎస్పీలు, ఏఎస్పీలు

మహబూబాబాద్ రూరల్: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని మానుకోట ఎస్పీ సంగ్రాం సింగ్ జీ పాటిల్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సరిహద్దు, అంతర్ జిల్లా సమన్వయ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ సంగ్రాం సింగ్ జీ పా టిల్, ములుగు ఎస్పీ గౌష్ ఆలం, ములుగు ఏఎస్పీ అశోక్ కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ సిరిశెట్టి, మానుకోట అదనపు ఎస్పీ చెన్నయ్య, మహబూబాబాద్ డీఎస్పీ సత్యనారాయణ పాల్గొన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు రవాణా, మద్యం, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల నిర్వహణ, తనిఖీలపై చర్చించారు.

నేటి నుంచి ఉత్సవాలు

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలోని అనుబంధ దేవాలయాల్లోని శ్రీశుభానందదేవి, శ్రీమహాసరస్వతీ అమ్మవార్ల ఆలయాల్లో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆలయాలను పూలతో అందంగా అలంకరించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రధాన ఆలయం, శ్రీశుభానందదేవి, శ్రీ మహాసరస్వతీ అమ్మవార్ల ఆలయాలు జిగేల్‌మంటున్నాయి. ఆదివారం మొదటి రోజు అమ్మవారు శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని అర్చకులు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- ములుగు ఎమ్మెల్యే సీతక్క

గంగారం: ఏజెన్సీ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే సీతక్క అన్నారు. గంగారం మండలంలోని కామారం గ్రామ శివారు బర్ల మల్లయ్యగుంపులో బతుకమ్మ వేడకల్లో పాల్గొన్నారు. తొలుత గ్రామదేవత విగ్రహం వద్ద కొబ్బరి కాయ కొట్టి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సీతక్క మాట్లాడారు. పోడు భూములను లాక్కొని చెట్లు, వన్యప్రాణుల రక్షణ పేరుతో ఏజెన్సీ ప్రాంతాల్లో జీవిస్తున్న ప్రజలను ఆయా ప్రాంతాల నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. అనంతరం మండలంలోని కామారం గ్రామ శివారులోని బర్లమల్లయ్యగుంపుకు చెందిన 40 కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

చేసి కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వారికి కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గంగారం, కొత్తగూడ మండల పార్టీ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు, వజ్జ సారయ్య, ఎంపీపీ సువర్ణపాక సరోజన, వైస్ ఎంపీపీ ముడిగ వీరభద్ర, నాయకులు జగ్గారావు, పోతయ్య, సుంకరబోయిన మొగిళి, యూత్ అధ్యక్షుడు ముడిగ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో చిన్నారి మృతి



మాధురి(ఫైల్)

మంగపేట: మండల పరిధిలోని రమణక్కపేటకు చెందిన వీర్ల మాధురి(9) డెంగీతో మృతి చెందింది. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చిన్నారి జ్వరంతో బాధపడుతుండగా తల్లి వెంకటరమణ ఈ నెల 11న భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించారు. పరీక్షించిన వైద్యులు ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్నాయని వైద్యం చేసి మందులిచ్చారు. ఇంటికి వచ్చి మందులు వాడితూ రెండు రోజులు గడిచినా జ్వరం తగ్గకపోగా వాంతులు చేసుకుంటుండడంతో శుక్రవారం మళ్లీ అదే ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీ జ్వరమని నిర్ధారించి వైద్యం అందించారు. అయినా పాప ఆరోగ్యం క్షీణిస్తుండడంతో వెంటనే ఖమ్మం పెద్దాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఖమ్మం ఎక్కువ దూరం కావడంతో వెంటనే శనివారం అంబులెన్స్‌లో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యం అందిస్తున్న క్రమంలోనే పరిస్థితి విషమించి మాధురి కన్నుమూసింది.

గ్రామంలో విషాదఛాయలు

బతుకమ్మ పండుగ రోజు చిన్నారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో వీర్ల వెంకటనర్సయ్య(పోస్టు మాస్టర్), వెంకటరమణ దంపతుల కూతురు, కుమారుడు పదేళ్ల క్రితం శివరాత్రి రోజున గోదావరి స్నానానికి వెళ్లి మృత్యువాత పడ్డారు. దీంతో చిన్నారి మాధురిని వారు దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే 2019లో వెంకటనర్సయ్య తన పిల్లలు దూరమయ్యారనే మనస్తాపంతో అదే గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కన్న కూతురు, కుమారుడు, భర్తను కోల్పోయి దత్తత తీసుకున్న చిన్నారిని చూసుకుంటూ జీవనం సాగిస్తుండగా మాధురి సైతం డెంగీతో మృత్యువాత పడడంతో వెంకటరమణతో పాటు స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

క్లుప్తంగా

కారు ఢీకొని యువకుడి మృతి


మణిదీప్ (ఫైల్)

నర్సంపేట రూరల్ : కారు ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన నర్సంపేట పట్టణంలోని కాకతీయనగర్‌లో జరిగింది. నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామానికి చెందిన మాదిరెడ్డి మణిదీప్ (30) పట్టణంలో ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా శనివారం బైక్‌పై చెన్నారావుపేట మండలంలో ఓ పేషెంట్‌కు ఫిజియోథెరఫి చేసి వస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని కాకతీయ నగర్‌కు చేరుకోగా ఎదురుగా వస్తున్న కారు.. మణిదీప్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి మేనమామ ఈదునూరి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శీలం రవి తెలిపారు.

రైలు ఢీకొని గొర్రెల కాపరి..


ఈదయ్య (ఫైల్)

కాశిబుగ్గ: రైలు ఢీకొని ఓ గొర్రెల కాపరి మృతి చెందాడు. ఈ ఘటన చింతలపల్లి, వరంగల్ రైల్వే స్టేషన్ మధ్య జరిగింది. దుగ్గొండి మండలం బలవంతపురం గ్రామానికి చెందిన సంగనబోయిన ఈదయ్య (56) ధర్మారంలో కుమారుడు వద్ద ఉంటూ గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం గొర్రెల కోసం ధర్మారం ట్రాక్ అవతల వైపు వెళ్తుండగా అప్ లైన్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కె రాజు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుమారుడు రాజుకు అప్పగించామని జీఆర్పీ సీఐ నరేష్ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..


రాజ్‌కుమార్ (ఫైల్)

టేకుమట్ల: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం అంకుషాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దానవేని రాజ్‌కుమార్(23) మద్యానికి బానిసై నిత్యం కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీన కూడా తల్లితో ఘర్షణ పడి గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కాగా, శనివారం మృతుడి తల్లి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు - 176/-
బ్రాయిలర్ చికెన్ రేటు - 250/-
స్కిన్‌లెస్ చికెన్ రేటు - 280/-
Cell: 9989299661

జేఎన్ఎస్‌లో క్రీడా పండుగ..

మూడు రోజులు కొనసాగనున్న సౌత్‌జోన్ చాంపియన్‌షిప్

- 5 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి హాజరు
- సుమారు 1000 మంది క్రీడాకారులు, 100 మంది టెక్నికల్ టీమ్
- ఏషియన్ చాంపియన్స్ నందిని, జ్యోతి హాజరు?

హన్మకొండ : హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం అథ్లెట్లతో సందడిగా మారింది. హనుమకొండ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి (ఈ నెల 15, 16, 17వ తేదీల్లో) మూడు రోజులు నిర్వహిస్తున్న 34వ సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌నకు స్టేడియం ముస్తాబైంది. దక్షిణ భారత దేశం నుంచి ఐదు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఈ పోటీల్లో పాల్గొననున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచే వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు, టెక్నికల్ అఫీషియల్స్ స్టేడియం చేరుకున్నారు. దీంతో మైదాన పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.


స్టేడియంలో క్రీడాకారులు దుస్తులు మార్చుకునే గది ఎదుట నిలిచిన మురుగు నీరు

- మూడు రోజులు జరిగే అథ్లెటిక్స్ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో పాటు పాండిచ్చేరి, లక్షద్వీప్ నుంచి 1000 మంది క్రీడాకారులు, 100 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్, మేనేజర్స్, ఆయా రాష్ట్రాల నుంచి సుమారు 100 మంది అథ్లెటిక్స్ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.
- అండర్ –14,16,18,20 బాలబాలికల విభాగంలో నిర్వహించే చాంపియన్‌షిప్‌లో 100, 200, 300, 400, 800, 1500, 2000, 5000, 10000 మీటర్ల రన్నింగ్ పోటీలు, 5కే, 10కే రేస్‌వాక్, డిస్కస్‌త్రో, హ్యామర్‌త్రో, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్, పోల్‌వాల్ట్, హర్డిల్స్, స్టిపుల్ చేజ్, డెకాథ్లాన్, హెప్టాథ్లాన్‌తో పాటు మిడ్‌రిలే, రిలేస్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు.
- ఇటీవల చైనాలో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ అథ్లెట్ నందిని, సిల్వర్ మెడల్ సాధించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అథ్లెట్ జ్యోతి ఆదివారం సాయంత్రం జరగనున్న ప్రారంభోత్సవ వేడుకలకు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని నిర్వాహకులు తెలుపుతున్నారు. యువ అథ్లెట్లతో పాటు ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత జేజే శోభ ఇతర ప్రముఖ క్రీడాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు.
- నెల రోజుల క్రితమే హనుమకొండలో సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ నిర్వహించేందుకు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అనుమతులు ఇస్తూ తేదీలను సైతం ఖరారు చేసింది. అయితే స్టేడియంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించలేదు. క్రీడాకారులు దుస్తులు మార్చుకునే గది ఎదుట మురుగునీరు చేరి దోమలకు ఆవాసంగా మారింది. సింథటిక్ ట్రాక్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగినప్పటికీ తొలగించకుండా వదిలేశారు. అలాగే, స్టేడియంలో ఎక్కడ చూసినా వీధికుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో క్రీడాకారులు బెంబేలెత్తుతున్నారు.

కనిపించని టాయిలెట్లు

ఐదు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1000 మంది క్రీడాకారుల్లో 90 శాతం శనివారం తెల్లవారుజామునే స్టేడియం చేరుకున్నారు. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని నిర్వాహకులకు తెలిసినా ముందు జాగ్రత్తగా తాత్కాలికంగా కనీసం మొబైల్ టాయిలెట్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు క్రీడాకారులు, వారి వెంట వచ్చిన గార్డిన్స్, టెక్నికల్ అఫీషియల్స్ ఇబ్బందులు పడ్డారు.

పోటీలకు జేఎన్ఎస్ సిద్ధం



మూడు రోజులు జరగనున్న సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జేఎన్ఎస్‌ను సిద్ధం చేశాం. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాక్, పరిసర ప్రాంతాలను సిద్ధంగా ఉంచాం. క్రీడాకారులకు మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేశాం.

-స్టాన్లీజోన్స్, ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం

మూడు రోజుల నుంచి శ్రమిస్తున్నాం



మూడు రోజులు జరిగే సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అసౌకర్యం కలగొద్దనే ఉద్దేశంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులం మూడు రోజుల నుంచి రాత్రి, పగలు శ్రమిస్తున్నాం. శుక్రవారం అర్ధరాత్రి నుంచి క్రీడాకారులు స్టేడియం చేరుకుంటున్నారు.

-ఐలి చంద్రమోహన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు, హనుమకొండ అథ్లెటిక్స్ సంఘం


ఎన్‌రోల్ చేస్తున్న క్రీడాకారులు




అథ్లెటిక్స్ క్రీడలకు వచ్చి చెట్టు కింద బస చేస్తున్న క్రీడాకారులు

ప్రభుత్వాస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

- 5 కేజీల అండాశయ తిత్తుల తొలగింత


శస్త్ర చికిత్స చేస్తున్న వైద్య బృందం

వర్ధన్నపేట: వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. ఓ మహిళ కడుపులో ఉన్న 5 కేజీల బరువు గల అండాశయ తిత్తులు తొలగించారు. దీంతో సదరు మహిళ ప్రాణాపాయం నుంచి బయటపడింది. వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఆకుల లచ్చమ్మ కొన్ని రోజుల నుంచి కడుపునొప్పి, వాంతులు, మూత్రపిండ సమస్యతో బాధపడుతోంది. దీనిపై ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించగా సుమారు రూ. రెండు లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో ఆర్థికంగా అంత ఖర్చు చేయలేని లచ్చమ్మ.. ఈ నెల 8న వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను కలవగా ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం శనివారం శస్త్ర చికిత్స నిర్వహించి ఆమె కడుపులో ఉన్న 5 కేజీల రెండు అండాశయ తిత్తులను తొలగించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నర్సింహాస్వామి ఆధ్వర్యంలో సర్జన్ సోమశేఖర్, మత్తు వైద్యులు నర్సింహాస్వామి, కృష్ణ, స్టాఫ్ నర్స్ సుమలత, అసిస్టెంట్ వినయ్, భాస్కర్, శంకర్, నయీం ఈ శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భంగా వైద్య బృందం, సిబ్బందికి లచ్చమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఊకల్ క్రాస్ వద్ద వాహన తనిఖీలు..

- రూ. 5.58 లక్షలు స్వాధీనం

గీసుకొండ: మండలంలోని ఊకల్ క్రాస్ వద్ద పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 5.58 లక్షల నగదును గుండేటి ప్రసాద్ అనే వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. గుండేటి ప్రసాద్ గిర్నిబావి నుంచి నగదును వరంగల్‌కు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు పేర్కొన్నారు.

మద్యం, డబ్బు తరలిస్తే కఠిన చర్యలు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వాహనం తనిఖీ
- లభ్యమైన 9 వాటర్ బాటిళ్లు, టిఫిన్, టి బ్యాగులు

మామునూరు: తెలంగాణలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో అనుమతి లేకుండా మద్యం, డబ్బు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ హెచ్చరించారు. వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టు వద్ద శనివారం సాయంత్రం పలు శాఖల పర్యవేక్షణాధికారుల ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ నుంచి తొర్రూరు వైపునకు వెళ్తున్న రాష్ట్ర పంచాయతీ గ్రామీణ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కారును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో 9 వాటర్ బాటిళ్లు, టిఫిన్, టి బ్యాగులు లభ్యం కాగా వాటిని సీజ్ చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ అనుమతి, ఆధారం లేకుండా డబ్బును తరలిస్తే స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులు

- జూనియర్ అసిస్టెంట్‌పై మిల్స్‌కాలనీ పీఎస్‌లో ఫిర్యాదు

కాశిబుగ్గ: మహిళా ఉద్యోగిపై జూనియర్ అసిస్టెంట్ లైగింక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వేధింపులకు గురైన మహిళా ఉద్యోగి కుటుంబీకుల కథనం ప్రకారం.. నగరంలోని ఈఎస్ఐ డిస్పెన్సరీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి (స్వీపర్)పై అదే డిస్పెన్సరీలో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్ ఎండీ అజీంపాషా కొంత కాలంగా లైగింక వేధింపులకు పాల్పడుతున్నాడు. 'నీకు నెల జీతం రాదు కాదా.. నిన్ను అన్ని విధాలా చూసుకుంటానని' తరుచూ వేధింపులకు గురి చేస్తున్నాడు. మరో రోజు రూ.20 వేలు తీసుకుని బంగారం కొనుక్కొమని ఒత్తిడి చేశాడు. సాయంత్రం బయోమెట్రిక్ వేలిముద్ర వేస్తుండగా ఆమెపై చేయి వేసి లైంగిక వేధింపులకు పాల్పడగా సదురు మహిళా ఉద్యోగి తప్పించుకుని పారిపోయింది. అయినా అతనిలో మార్పు రాకపోవడంతో పాటు ఇతర మార్గాల్లో డబ్బు సంపాదిస్తుందంటూ స్టాఫ్‌కు చెప్పగా ఆమె ఈ విషయాన్ని బాధితురాలి భర్త దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఈ విషయాన్ని ఐఎంఓతో పాటు ఈఎస్ఐ జేడీకి ఫిర్యాదు చేయడంతో వారు అజీంపాషాను హెచ్చరించారు. అయినా లైంగిక వేధింపులు మానకపోవడంతో మనస్తాపానికి గురైన మహిళా ఉద్యోగి గురువారం డిస్పెన్సరీలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే అక్కడి ఉద్యోగులు ప్రథమ చికిత్స చేసి ఎంజీఎంలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత మిల్స్ కాలనీ పీఎస్‌లో అజీంపాషాపై ఫిర్యాదు చేసింది.

కొత్తూరు జెండాలో వ్యక్తికి కత్తిపోట్లు

కాజీపేట: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు జెండా మాత బార్ గల్లీలో శనివారం రాత్రి గొడవ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కందికొండ యుగెంధర్‌ను కనుగుల రమేష్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యుగెంధర్‌ను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. గొడవకు కారణం వివాహేతర సంబంధమే కారణమని పలువురు భావిస్తున్నారు.

'వర్ధన్నపేట'లో ఓటర్లకు కానుకలు

- వాటర్ బాటిళ్లు, టిఫిన్ బాక్స్‌లు స్వాధీనం


చింతనెక్కొండ గ్రామంలో సర్పంచ్ ఇంట్లో దాడులు చేసి స్వాధీనం చేసుకున్న డప్పులు, టిఫిన్‌బాక్సులు, వాటర్‌బాటిళ్లు

పర్వతగిరి: వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధి పర్వతగిరి మండలంలోని పలు గ్రామాల్లో అధికార పార్టీ నేతలు.. ఓటర్లకు పంపిణీ చేసేందుకు నిల్వ చేసిన వాటర్ బాటిళ్లు, లంచ్ బాక్స్‌లు, డప్పులు, బ్యాగ్‌లను ఎన్నికల స్పెషల్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సోమారం, చింతనెక్కొండ, కల్లెడ గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఓటర్లకు పంపిణీ చేసేందుకు కానుకలు సిద్ధం చేసి పలువురి ఇళ్లలో దాచినట్లు అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు స్పెషల్ ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్లు బాబురావు, సురేష్ బృందం సోమారం గ్రామంలో సర్పంచ్ రాపాక రేణుకనాగయ్య ఇంట్లో 180 వాటర్ బాటిళ్లు, 280 బ్యాగులు, చింతనెక్కొండ గ్రామంలో సర్పంచ్ గటిక సుష్మామహేష్ ఇంట్లో 40 డప్పులు, 79 బ్యాగులు, 75 బాటిళ్లు, 72 టిఫిన్ బాక్సులు, కల్లెడ గ్రామంలో దొమ్మటి రాజు ఇంట్లో లంచ్ బాక్స్‌లు స్వాధీనం చేసుకుంది. బ్యాగులు పింక్ కలర్‌లో ఉండి వాటిపై అరూరి రమేశ్, సీఎం కేసీఆర్ ఫొటోలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని పర్వతగిరి పోలీసులకు అప్పగించినట్లు అధికారులు బాబురావు, సురేష్ తెలిపారు. పార్టీకి సంబంధించిన వస్తువులు ఎవరైనా సరే ఇళ్లలో నిల్వ ఉంచుకుంటే ఎలక్షన్ కోడ్‌కు సంబంధించిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా, మండలంలోని 33 గ్రామపంచాయతీలకు గాను మూడు గ్రామాల్లో టిఫిన్ బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు, బ్యాగులు, డప్పులను అధికారులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయగా, మిగిలిన 30గ్రామాల్లో పంపిణీకి కిట్లను సిద్ధంగా ఉంచినట్లు తెలిసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ Join M.Com, MA English, MA Social work, PLNM Degree College. Opp: ANU. Ladies with 60% / Above 80% get Free Discount. 9177408565 / 9642656449 [G-781773]

REAL ESTATE

TOLET/FLAT FOR SALE

■ HNK రెడ్డికాలనీలో G+1 కమర్షియల్ బిల్డింగ్‌లో Each Floor 2400 sft గలది. కిరాయికి యివ్వబడును prefer for Hospitals & GMR బృందావన్‌లో 1st Floor 1665 sft గల ఫ్లాట్ అమ్మబడును. సంప్ర॥ 8886996262. [W-1220910]

LAND FOR SALE

■ రెండు ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. నియర్ వంగపల్లి క్రాస్ రోడ్, గ్రా॥ లక్ష్మీపూర్, పర్కాల్, హుజురాబాద్ హైవే మం॥ కమలాపూర్, జి॥ హన్మకొండ. సెల్: 8121374317. [W-189192]

PLOT FOR SALE

■ దసరా స్పెషల్ ఆఫర్! 5గ్రా॥ గోల్డ్ ఫ్రీ. మీ బడ్జెట్‌లో 126 ఎ॥ DTCP అప్రూవ్డ్ 30నెలల వాయిదా పద్ధతిలో, ప్లాట్ తీసుకున్న వారికి బుకింగ్ అమౌంట్ 36వేలు. Ph: 6309771255 [H-793469]

FLAT FOR SALE

■ "0" Kms from SEZ Financial Dist, Gachibowli, Hyd. Luxury Gated Apartments, 2 / 3 / 4 BHK Flats for Sale. Near Google, Amazon etc., Ph : 9849025003. [HA-11785]

SERVICES

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-1229445]

సినిమా వార్తల కోసం లాగిన్ అవ్వండి www.sakshi.com

BUSINESS

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710 [HA-41395]

BUSINESS OFFER

■ వెల్లుల్లి పొట్టు తీసే మిషనరీస్ అమ్మబడును (Peeled Garlic Missionaries for Sale) సంప్ర : 9396325247 [HA-13204]

■ My City కంపెనీ ద్వారా వ్యాపార అవకాశం. మోర్, బిగ్ బాస్కెట్‌లలో నిత్యవసర వస్తువులు కొనండి కొనిపించండి. ప్రతిరోజు ఆదాయం పొందండి. మహిళలకు అవకాశం. 8688842188 [G-1166]

WANTED

■ Govt (Regd) సంస్థ తరఫున Work చేయుటకు సొంత కంప్యూటర్ గలవారు కావలెను. ఇంటి దగ్గరే వర్క్ చేస్తూ 9 to 19K సంపాదించే అవకాశం. సెల్: 8977429273. [W-1220904]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000–16000. సెల్: 8688072125. [W-1220909]

■ Wanted Reporters in Hyderabad Twin Cities, in all the districts, mandals Females/Males (Minimum 3 Months Exp) SWATHI NEWS. Ph:7997733373 [H-788335]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (tower-ac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డోస్ట్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ.18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1206681]

■ రామకృష్ణ హోంకేర్ సర్వీస్: VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులసేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 6281208600, 6281208656 [B-1068136]

■ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: 10th/ ఇంటర్. జీతం: 14,000 +PF+ESI+TA + DA. @ మిడ్‌వెస్ట్ గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్ AP, TS. సంప్ర: Ph: 8121006637 [HA-722]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీతం: 18K. Ph: 9640400073, 9848571888. [H-189342]

■ RRRకు దగ్గరలో DTCP అప్రూవ్డ్ లేఅవుట్ @ 4,999/- కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ డైరెక్టర్స్ పార్ట్/ఫుల్ టైం, సాలరీ, ఫ్రీ లాన్సర్స్ కా॥ Ph: 8712379382/ 9391665516. [HA-12362]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పూల వనం



పూలను పూజించి.. ప్రకృతి ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకైన ఈ పండుగ శనివారం ప్రారంభమైంది. తొలి రోజు ఎంగిలి పూల బతుకమ్మను ఆడబిడ్డలు ఆనందంగా జరుపుకున్నారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల్లో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ చిన్నాపెద్దా తేడా లేకుండా ఆడిపాడారు. కాగా, బతుకమ్మలతో ఆయా ప్రాంతాలు పూలవనమయ్యాయి.


గార్లలో పెద్ద బతుకమ్మ ఎత్తుకెళ్తున్న కందునూరి సుజాత


జనగామ: బతుకమ్మకుంట వద్ద మహిళల సంబురం


రాయపర్తి : కొండూరులో బతుకమ్మ ఆడుతున్న మంత్రి ఎర్రబెల్లి


బతుకమ్మతో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సతీమణి రేవతి


నర్సంపేట: బతుకమ్మ ఆడుతున్న జెడ్పీ ఫ్లోర్ లీడర్ స్వప్న


వరంగల్ కాశీవిశ్వేశ్వరాలయంలో..


మహబూబాబాద్ : రామాలయంలో ...